ప్రజావాణిలో మాజీ కార్పొరేటర్‌ ఫిర్యాదు



ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్‌ వాజీద్‌హుస్సేన్‌

ముషీరాబాద్‌: భోలక్‌పూర్‌లోని సమస్యలను పరిష్కరించాలని ప్రజావాణిలో మాజీ కార్పొరేటర్‌ వాజీద్‌ హుస్సేన్‌ సోమవారం జీహెచ్‌ఎంసీ జెడ్‌సీ రవికిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. భోలక్‌పూర్‌లో శేఖర్‌రెడ్డి వీధి వెనుక భాగంలో సీసీరోడ్డు పనులు, దేవీచౌక్‌ వద్ద అధ్వానంగా మారిన రోడ్లను వెంటనే ఆధునీకరించాలని ఆయన కోరారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గాంధీనగర్‌లో సబర్మతినగర్‌లో వెంటనే కమ్యూనిటీహాల్‌ నిర్మాణ పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు అభిషేక్‌ కెనడీ తదితరులు పాల్గొన్నారు.

బాలు పాటకు బ్రహ్మరథం

చిక్కడపల్లి: సాంస్కృతిక వేదిక రాముకుమార్‌ కళారవిందం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో బాలు పాటకు బ్రహ్మరథం శీర్షికతో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న గీతాలను వీనుల విందుగా ఆలపించారు. అనంతరం జరిగిన సమావేశానికి వంశీ రామరాజు ముఖ్యఅతిథిగా హాజరై గాయనీగాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా రాముకుమార్‌, ప్రముఖ గాయకుడు బాల సుబ్రహ్మణ్యం ప్రతిమను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులు భార్గవి, రవిశంకర్‌, నాగేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో రోడ్లను ఆధునీకరించాలి

ముషీరాబాద్‌: ముషీరాబాద్‌ డివిజన్‌లోని రోడ్లను ఆధునీకరించాలని కార్పొరేటర్‌ సుప్రియానవీన్‌గౌడ్‌ సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ముషీరాబాద్‌ డివిజన్‌లోని గంగపుత్ర కాలనీ, బాపూజీనగర్‌, సద్గురు టెంట్‌హౌస్‌ వీధి, అరుణ్‌ కోఆపరేటివ్‌ సొసైటీ వీధి, పటాన్‌ బస్తీ, ఫ్రెండ్స్‌ కాలనీలలోని రోడ్లను ఆధునీకరించాలని కోరారు. పార్సిగుట్ట వద్ద ఉన్న గౌడ కులస్తుల శ్మశానవాటికలో మరుగుదొడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. చాలా రోజులుగా ఆయా ప్రాంతాలలో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

పరామర్శ



మాజీ కార్పొరేటర్‌ పి.జ్ఞానేశ్వర్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న మాజీ గవర్నర్‌ బండారు దత్తాత్రేయ

అంబర్‌పేట: మాజీ కార్పొరేటర్‌, అంబర్‌పేట దేవాస్థాన సేవా సమితి చైర్మన్‌ పి.జ్ఞానేశ్వర్‌గౌడ్‌ను మాజీ గవర్నర్‌ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. ఇటీవల జ్ఞానేశ్వర్‌గౌడ్‌ మోకాలికి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నట్లు ఆయన తెలుసుకున్నారు. సోమవారం అంబర్‌పేటలోని ఆయన నివాసానికి విచ్చేసి ఆరోగ్య విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. మానసికంగా ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సేవాస్థాన సేవా సమితి ప్రధాన సలహాదారులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, నాయకులు గడ్డం లక్ష్మణ్‌గౌడ్‌, చింతల శ్రీనివాస్‌ముదిరాజ్‌, పి.వెంకటేశ్‌గౌడ్‌, బిందీ మల్లికార్జున్‌గౌడ్‌, గడ్డం శ్రీధర్‌గౌడ్‌, సీహెచ్‌ సుధాకర్‌, కిషోర్‌, దడిగె జగన్‌ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల నిరసన



చిక్కడపల్లి: తెలంగాణ ప్రభుత్వం అర్ధరాత్రి గ్రూప్‌–1 ఫలితాలను విడుదల చేయడంలో అంతర్యం ఏమిటని నిరుద్యోగుల ప్రశ్నించారు. అశోక్‌నగర్‌ చౌరస్తాలో సోమవారం వారు నిరసన తెలిపి మాట్లాడారు. తప్పుడు నియామకాలతో నిరుద్యోగులు అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. గ్రూప్‌–1 నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ప్రిలిమ్స్‌, మెయిన్స్‌ పరీక్షలకు వేర్వేరు హాల్‌ టికెట్‌లను ఇవ్వడంతో ఎవరికి లాభం చేకూరించారని ప్రశ్నించారు. అందరూ దొంగ పత్రాలతో ర్యాంకులు పొందారని ఆరోపించారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకూ తమ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు జనార్ధన్‌, ఇంద్రానాయక్‌, సుధాకర్‌, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలస్తీనా సంఘీభావ ర్యాలీ

ముషీరాబాద్‌: పాలస్తీనాపై ఇజ్రాయేల్‌ చేస్తున్న జాతి అహంకార దాడులను నిరసిస్తూ మంగళవారం ఉదయం 11.30 గంటలకు పాలస్తీన సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో వీఎస్‌టీ పార్కు నుంచి ఇందిరాపార్కు వరకు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.అన్మేష్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

భూగర్భంలోకి ఆస్పత్రి

శిథిలమై కూలేందుకు సిద్ధం
- 15 ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని వైనం
- ప్రజాప్రతినిధులు, అధికారులకు మొర
- వేడుకున్నా పట్టించుకునే వారే కరువు
- ఇప్పటికైనా స్పందించాలని వినతి



భూమిలో కూరుకుపోయిన బీజేఆర్‌ ప్రభుత్వ ఆస్పత్రి

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నిక నేపథ్యంలో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో అధికార కాంగ్రెస్‌ పార్టీ కోట్లాది రూపాయల వ్యయంతో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భారీగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. అయితే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల విషయంలో మాత్రం దృష్టిసారించడం లేదు. ముఖ్యంగా సర్కార్‌ బడులు, ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకురావడంలో పూర్తిగా విఫలమై ప్రజల ఆగ్రహానికి గురవుతోంది. జూబ్లీహిల్స్‌ నియోజకవర్గం షేక్‌పేట డివిజన్‌ పరిధి కిందికి వచ్చే ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్‌ బస్తీని ఆనుకుని సుమారు 1500 గజాల విస్తీర్ణంలో 30 సంవత్సరాల క్రితం సర్కార్‌ దవాఖానాను నిర్మించారు. వరద, మురుగు కారణంగా పక్కనే ఉన్న కొత్త చెరువులో నుంచి వస్తున్న మురుగుతో ఈ ఆస్పత్రి నిండిపోయి శిథిలావస్థకు చేరింది. రోజురోజుకూ ఆస్పత్రి నీట మునుగుతూ భూమిలోకి కూరుకుపోతుండటంతో 15 సంవత్సరాల క్రితం ఆస్పత్రిని మూసేసి అద్దె భవనంలోకి మార్చారు. అప్పటి నుంచి ఈ ఆస్పత్రి నిర్మాణ పనులకు దిక్కూ మొక్కూ లేకుండా పోయాయి. అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఖైరతాబాద్‌ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ ఈ ఆస్పత్రిని పునర్నిర్మిస్తామని, స్థానికులకు హామీ ఇచ్చారు. అయితే ఈ ఆస్పత్రి భవనం ఉన్న ప్రాంతం జూబ్లీహిల్స్‌ నియోజకవర్గం పరిధిలోకి వస్తుండటంతో అప్పటి ప్రజాప్రతినిధులు అడ్డుపుల్ల వేశారు. దీంతో అప్పటి నుంచి ఈ భవనం పూర్తిగా బురదలో కూరుకుపోయింది. ఐదేళ్ల క్రితం అప్పటి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావును కలిసిన స్థానికులు ఈ ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలంటూ కోరగా ఆయన పెడచెవిన పెట్టారు.

ఒకప్పుడు ప్రసవాలు కూడా జరిగేవి..

బీజేఆర్‌నగర్‌లోని సర్కార్‌ దవాఖానా ఒకప్పుడు చుట్టుపక్కల ఉన్న బస్తీలకు చెందిన 20 వేల మంది వరకు అందుబాటులో ఉండేది. ఇక్కడ ప్రసవాలు కూడా నిర్వహించేవారు. నిత్యం రోగులతో కిక్కిరిసిపోయేది. 2010 సంవత్సరం వరకు ఈ ఆస్పత్రి స్థానికులకు అందుబాటులోనే ఉంది. ఆ తర్వాత నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరింది. అప్పటి నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు పట్టించుకున్న పాపానపోలేదు. సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ ఆస్పత్రి పునర్నిర్మాణంపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. సికింద్రాబాద్‌ ఎంపీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్లమెంట్‌ పరిధిలో ఉండటంతో ఆయన సైతం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మంత్రి వివేక్‌ను ప్రశ్నించిన స్థానికులు..

జూబ్లీహిల్స్‌ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు జోరుగా శంకుస్థాపనలు చేయడంలో ముగ్గురు మంత్రులు పొన్నం ప్రభాకర్‌, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్‌ వెంకటస్వామి క్షణం తీరికలేకుండా తిరుగుతున్నారు. రెండు రోజుల క్రితం మంత్రి వివేక్‌ వెంకటస్వామి శిథిలావస్థలో ఉన్న బీజేఆర్‌నగర్‌ సర్కార్‌ దవాఖానా సమీపంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చారు. బీజేఆర్‌నగర్‌ బస్తీ ఎమ్మార్పీఎస్‌ నాయకుడు బస్తీ ఆస్పత్రి సంగతేమిటని మంత్రిని నిలదీశాడు. ఈ ఆస్పత్రి చుట్టూ ఉన్న ఐదు బస్తీలు జూబ్లీహిల్స్‌ నియోజకవర్గం కిందికి వస్తాయని, ఇక్కడ ఆస్పత్రిని నిర్మించాలంటూ మంత్రికి వివరించడంతో ఆస్పత్రి నిర్మాణంపై అధికారులతో సంప్రదిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ధర్మాన్ని కాపాడేందుకు ముందుకు రావాలి



వీరన్నగుట్టలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న స్వామీజీలు

కాచిగూడ: దేశంలో ధర్మాన్ని కాపాడేందుకు యువత ముందుకు రావాలని స్వామిజీలు, సాధు సంతులు, సన్యాసులు పిలుపునిచ్చారు. సోమవారం కాచిగూడ వీరన్నగుట్ట (శ్యామ్‌ మందిర్‌)లో ఏర్పాటు చేసిన ధర్మాచార్య సమావేశంలో సంగ్రామ్‌ మహారాజ్‌, దుర్గానందపురి స్వామి, కమలేష్‌ మహారాజ్‌, విశ్వాత్మనందగిరి స్వామి, డాక్టర్‌ శ్రీనివాస్‌ స్వామి, డాక్టర్‌ శిల్ప దేశ్‌ముఖ్‌, ఆత్మానంద భారతి, బెనారస్‌ గురుస్వామి, వీర ధర్మజ స్వామి, విజయ ప్రతాప్‌ మహారాజ్‌, మహాదేవి మహారాజ్‌, జైరామ్‌ గురుస్వామి, సర్వేశ్వరానంద శివ యోగి స్వామి, బండి రాములు, శ్రీ శశికళ, కెబివి శివకుమార్‌, డాక్టర వివకుమార్‌ స్వామి తదితరులు మాట్లాడారు. ధర్మాన్ని కాపాడటం అంటే దేశాన్ని కాపాడటమేనని యువత తెలుసుకోవాలన్నారు. మోసపూరిత మతమార్పిడుల వల్ల మన సంస్కృతిని కోల్పోతే భవిష్యత్‌ తరాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. దేశ ఐక్యత, అఖండత, సాంస్కృతిక గుర్తింపు, ధర్మంపై ఆధారపడి ఉన్నందున దానిని కాపాడటం ప్రతి పౌరుడి కర్తవ్యమని అన్నారు. మోసపూరిత మత మార్పిడులను అడ్డుకోవడానికి రూపొందించిన మతమార్పిడి నిషేధ చట్టాలకు పూర్తి మద్దతు ఉంటుందన్నారు. బలవంతపు మత మార్పిడులను అడ్డుకునే ఉమ్మడి పౌర చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

పెన్షన్‌బుల్‌ శాలరీ సీలింగ్‌ను రూ.26వేలకు పెంచాలి



బర్కత్‌పురలోని పీఎఫ్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ రిటైర్డ్‌ కార్మికులు

కాచిగూడ: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పెన్షన్‌ దారులందరికి కేంద్రం హయ్యర్‌ పెన్షన్‌ను వర్తింపచేయాలని తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్‌ ఎంప్లాయిస్‌ అసోసియేసన్‌ ప్రతినిధులు డిమాండ్‌ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్‌ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సోమవారం బర్కత్‌పుర లోని పీఎఫ్‌ కార్యాలయం ఎదుట రిటైర్డ్‌ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెన్షన్‌బుల్‌ శాలరీ సీలింగ్‌ను రూ.26వేలకు పెంచాలని డిమాండ్‌ చేశారు. ఈపీఎఫ్‌లో తిరస్కరించిన దరఖాస్తులను సవరించి హయ్యర్‌ పెన్షన్‌ను మంజూరు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఈపీఎఫ్‌ కమిషనర్‌ను కలిసి అందజేశారు.

మద్యం దుకాణాల | దరఖాస్తు రుసుములో రాయితీ ఇవ్వాలి

ముషీరాబాద్‌: మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల వ్యాపారస్తులకు దరఖాస్తు ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలని ఆల్‌ ఇండియా హ్యూమన్‌ రైట్స్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షులు సిరిగిరి శ్యామ్‌కుమార్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం ఫౌండేషన్‌, ఎక్సైజ్‌ శాఖ కమిషనర్‌కు ఆయన వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్‌ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన 2025–27 సంవత్సరానికి మద్యం దుకాణాల ఏర్పాటులో గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు ఐదు శాతం రిజర్వేషన్‌లు ఖరారు చేస్తూ అమలు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అయితే రిజర్వేషన్‌లు ఉన్న దుకాణాలకు దరఖాస్తు రుసుము, రిజర్వేషన్‌లు లేని దుకాణాలకు ఒక దరఖాస్తు రుసుము పెట్టడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు మూడు లక్షల రూపాయల దరఖాస్తు రుసుము చెల్లించడం చాలా కష్టం అని తెలిపారు. కాబట్టి రిజర్వేషన్‌ ఉన్న మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు 50 శాతం రియితీ ఇవ్వాలని ఎక్సైజ్‌ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రిజర్వేషన్‌ ఉన్న మద్యం దుకాణాలన్నిటికి దరఖాస్తు రుసుములో 50 శాతం రాయితీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సిరిగిరి శ్యామ్‌ విజ్ఞప్తి చేశారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తున్నాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ గావాయిపై ఆర్‌ఎస్‌ఎస్‌ ముసుగులో ఉన్న అరాచక న్యాయవాది రాకేష్‌ కిషోర్‌ తన బుట్‌ విసిరి దాడికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేవీపీఎస్‌ ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్‌ పథకం ప్రకారం చేసిన దాడి అని ఆరోపించారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ ఆర్‌ఎస్‌ఎస్‌ చీఫ్‌ మోహన్‌భగవత్‌, ప్రధాని మోదీలు దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. సనాతన ధర్మం ముసుగులో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులోనే ప్రధాన న్యాయమూర్తిపై భౌతికదాడికి పాల్పడటం దేశ చరిత్రలోనే చీకటి రోజు అన్నారు. అత్యున్నత న్యాయస్థానంలో కూడా ఆర్‌ఎస్‌ఎస్‌ దాడులు ఆగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 7న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు.

ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తున్నాం

కవాడిగూడ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై కోర్టులో చెప్పులు విసిరి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ న్యాయవాదులు జేఏసీ కన్వీనర్‌ పులిగారి గోవర్ధన్‌ రెడ్డి అన్నారు. సోమవారం కవాడిగూడలోని జేఏసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి దాడులను ప్రతి భారతీయ పౌరుడు ఖండించాలన్నారు. దాడికి పాల్పడిన నిందుతులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు శుభపరిణామం

కాచిగూడ: బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం 42శాతానికి పెంచడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడం శుభపరిణామమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. సోమవారం కాచిగూడలో జరిగిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 42శాతం రిజర్వేషన్లు ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన కేసును కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధించామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు పెంచుతూ జీవో నం.9కి వ్యతిరేకంగా రాష్ట్ర హైకోర్టులో రెడ్డి జాగృతి వేసిన పిటిషన్‌లో ఇంప్లీడ్‌ అయ్యిందన్నారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రాకముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించినప్పటికీ, అసెంబ్లీలో బిల్లు చేసినప్పుడు రెడ్డి జాగృతి నోరు మెదపలేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వ ఆర్డర్‌ (జీవో) విడుదలైన తర్వాత రాత్రికి రాత్రే కోర్టులను వేదికగా చేసుకొని బీసీలకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. బీసీల పక్షాన ధర్మం, న్యాయం ఉన్నందున హైకోర్టులో న్యాయం జరుగుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. బీసీలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని గుజ్జ సత్యం కోరారు.

ప్రేక్షకరంజకంగా జైకిసాన్‌ రూపక ప్రదర్శన



కళాకారులను సన్మానిస్తున్న నిట్టల గోపాలకృష్ణ

చిక్కడపల్లి: కమలాకర చారిటబుల్‌ ట్రస్ట్‌, కమలాకర లలిత కళాభారతిల సంయుక్తాధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో మహాత్మాగాంధీ , లాల్‌బహదూర్‌ శాస్త్రిల జయంతిని పురస్కరించుకొని ప్రదర్శించిన జైకిసాన్‌ రూపక ప్రదర్శన ప్రేక్షకరంజకంగా సాగింది. కళాకారులు పాత్రోచితంగా నటించి ప్రదర్శనను రక్తికట్టించారు. అనంతరం జరిగిన సమావేశంలో నిట్టల గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై కళాకారులను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు బి.జయరాములు, శ్రీధర్‌, లక్ష్మణాచార్యులు, వీవీ రాజు, ఎస్‌.మాధవి, వెంకటేశ్వర్‌రావు, భారతీకమలాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్‌ యూనియన్‌ నేత నారాయణ మృతి



ముషీరాబాద్‌: మహబూబ్‌నగర్‌ జిల్లా మక్తల్‌కు చెందిన రిటైర్డ్‌ హెడ్‌ మాస్టర్‌, టీచర్స్‌ యూనియన్‌ నాయకులు బి.నారాయణ వయోభారంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. భార్య సంవత్సరన్నర క్రితం మృతి చెందారు. ఉపాధ్యాయుడుగా ఉన్న సమయంలో టీచర్స్‌ యూనియన్‌ నాయకుడిగా, పాఠశాలల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి, చెక్‌ డ్యాముల నిర్మాణానికి ఎంతగానో కృషి చేశారు. ఆయన అంత్యక్రియలు అంబర్‌పేట శ్మశాన వాటికలో నిర్వహించారు. ఓర్పుతో విద్యాబుద్ధులు నేర్పించి తమ ఉన్నతికి కారణమైన గురువులు నారాయణ చిరస్మరణీయులని పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ముక్తల్‌ నియోజకవర్గానికి చెందిన ఆయన చిన్ననాటి గురువు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన రాంనగర్‌లోని ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రి వెంట రిటైర్డ్‌ ఐజీ ఆకుల నర్సింమ్మ, ప్రముఖ న్యాయవాది ఏ.సత్యనారాయణ, మద్దెల వీడు సర్పంచ్‌ కొత్త వెంకటప్ప, బాలకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, సుదర్శన్‌, ఆంజనేయులు, సూర్య తదితరులున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

కవాడిగూడ: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని గాంధీ నగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటలక్ష్మి హెచ్చరించారు. సోమవారం లోయర్‌ ట్యాంక్‌ బండ్‌లోనిర్వహించిన డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ టెస్ట్‌లో పట్టుబడ్డ పలు డ్రైవర్లపూ కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... హైదరాబాద్‌ నగర ట్రాఫిక్‌ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విస్తృతంగా డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్‌ నిబంధనలను పాటించని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మద్యం తాగి ట్రావెల్స్‌ బస్సు నడుపుతున్న డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అందులో 30 మంది ప్రయాణికులు ఉన్నారని పేర్కొన్నారు.

బైక్‌లు గాయబ్‌.!

అంబర్‌పేట: ఇంటి ముందు పార్క్‌ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటన సోమవారం అంబర్‌పేట పోలీసు స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బాగ్‌అంబర్‌పేట మల్లికార్జున్‌నగర్‌లో నివసించే యాదగిరి, నర్సింహులు వారి ఇంటి ముందు అక్టీవా ద్విచక్రవాహనాలను పార్క్‌ చేసి నిద్రపోయారు. ఉదయం లేచి చూసే సరికి అవి కనిపించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు చార్జీల పెంపు దుర్మార్గం

రేపు బస్‌ భవన్‌ వద్ద ఆప్‌ నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న ఆప్‌ నేతలు

కవాడిగూడ: హైదరాబాద్‌ నగరంలో ఆర్టీసీ బస్సు చార్జీల పెంపు దుర్మార్గమని ఆమ్‌ ఆద్మీ పార్టీ రాష్ట్ర నేతలు బుర్ర రాముగౌడ్‌, విజయ్‌ మల్లంగి, ఎంఏ.మాజిద్‌ అన్నారు. మూడు నెలల క్రితమే విద్యార్థుల బస్సు పాసులు 30 శాతం, 50 శాతం పెంచిన ప్రభుత్వం మళ్లీ ఇప్పుడు హైదరాబాద్‌ ప్రజలపై మరోసారి బస్సు చార్జీలు పెంచి పేద, మధ్య తరగతి కుటుంబాల సంపదనను దోచుకుంటోందని మండిపడ్డారు. దోమలగూడలోని ఆప్‌ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 50 శాతం బస్సు చార్జీలను పెంచడం అంటే కాంగ్రెస్‌ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం పట్ల ఎటువంటి చిత్తశుద్ధి లేదనేది స్పష్టమవుతోందని అన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలకి సామాన్య ప్రజలను ఇన్ని ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్‌ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్‌ నియోజకవర్గ ప్రజలు రాబోయే ఉప ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్తారని అన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆమ్‌ ఆద్మీ పార్టీ పథకాన్ని కాపీ కొట్టి ఒకవైపు మహిళలకు ఉచిత రవాణా అంటూ మరోకవైపు పురుషులపై విద్యార్థులపై చార్జీల పెంపు పేరిట ఆర్థిక భారాన్ని మోపడం దారుణమన్నారు. ఢిల్లీలో ఆమ్‌ ఆద్మీ పార్టీ మహిళలకు ఉచిత బస్సు రవాణా పథకం కల్పిస్తూ, పురుషులపై ఎటువంటి చార్జీ పెంపుల భారం మోపలేదని వారు గుర్తు చేశారు. పెంచిన బస్‌ చార్జీలకు నిరసనగా అక్టోబర్‌ 8న బస్‌ భవన్‌ వద్ద ఆప్‌ నిరసన కార్యక్రమం చేపడుతుందని వారు తెలిపారు.

పెంచిన బస్సు చార్జీలను ఉపసంహరించుకోవాలి



బస్సు చార్జీల పెంపును నిరసిస్తూ గోల్కొండ చౌరస్తాలో ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ముషీరాబాద్‌: హైదరాబాద్‌నగరంలో పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను వెంటనే ఉపసహరించుకోవాలని గ్రేటర్‌ హైదరాబాద్‌ సెంట్రల్‌ సిటీ కమిటీ సీపీఎం కార్యదర్శి ఎం.వెంకటేష్‌ డిమాండ్‌ చేశారు. చార్జీలను పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం గోల్కొండ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా చార్జీలు తగ్గించాలని ఆందోళన కారులు నినాదాలు చేశారు. సీపీఎం కార్యదర్శి ఎం.వెంకటేష్‌ మాట్లాడుతూ... ఆర్టీసీ బస్సు చార్జీలను ఐదు, 10 రూపాయలు పెంచడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర భారం పడుతుందని ఆయన విమర్శించారు. ఆర్టీసీ కార్పొరేషన్‌ కొద్ది నెలల క్రితమే ఆర్టీసీ బస్సు పాస్‌లను పెంచారని ప్రస్తుతం బస్సు చార్జీలను కూడా పెంచుతూ తీసుకున్న నిర్ణయం చాలా అన్యాయం అన్నారు. ప్రజారవాణాను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. ఇప్పటికే ఎలక్ట్రిక్‌ బస్సులను అద్దె బస్సులుగా మారుస్తూ ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఆర్టీసీ కార్గో సర్వీసులను ప్రైవేటు సంస్థలకు అప్పగించే చర్యలు కొనసాగుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అరుణజ్యోతి, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.దశరథ్‌, ఎం.మహేందర్‌, నగర కమిఆటీ సభ్యులు ఆర్‌.వెంకటేష్‌, జి.నరేష్‌, ఎం.అజయ్‌బాబు, ఎన్‌.మారన్న, జి.కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు ప్రచారం చేయాలి

కాచిగూడ: విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల బకాయిలు చెల్లించడానికి ప్రభుత్వం వద్ద నిధులు లేవు కాని... మూసీ సుందరీకరణ చేయడానికి రూ.లక్షల కోట్ల నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రశ్నించారు. సోమవారం కాచిగూడలోని అభినందన్‌ గ్రాండ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని 12లక్షల 75వేల మంది విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్‌ ఎన్నికలు, మూసీ సుందరీకరణపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల చదువుపై లేదని ఆయన విమర్శించారు. విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్‌ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్‌ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన విద్యార్థిలోకానికి పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ పార్టీకి వ్యతిరేకంగా విద్యార్థులు ఎన్నికల్లో ప్రచారం నిర్వహించి ఆ పార్టీకి విద్యార్థుల సంఘటిత శక్తి ఏమిటో రుచి చూపించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్‌, ప్రవీణ్‌, కుమార్‌, జగదీష్‌, దయాకర్‌, బాలు, అర్జున్‌ తదితరులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలను బలోపేతం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మలక్‌పేటలో నిర్మించిన ప్రభుత్వ బధిరుల పాఠశాలను బలోపేతం చేయడంతో పాటు హాస్టల్‌ వసతిని కల్పించాలని డెవలప్‌మెంట్‌ సొసైటీ ఫర్‌ ద డెఫ్‌ జాతీయ నాయకుడు వల్లభనేని ప్రసాద్‌, ఉపాధ్యక్షులు కాటమోని వెంకటేష్‌గౌడ్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 1936లో స్థాపించి ఈ పాఠశాలపై ప్రభుత్వం దృష్టిని సారించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. జూనియర్‌, డిగ్రీ కళాశాలకు అనుబంధంగా ఉన్న ఖాళీ స్థలంలో హాస్టల్‌ వసతి కల్పించాలన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలో సైగల భాష ద్వారా ప్రత్యేక మూగ, బదిరిల స్కూల్లో హాస్టల్‌ వసతి కల్పించాలని కోరారు. దివ్యాంగులకు 4 శాతం ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగాలలో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. బోగస్‌ వికలాంగుల సర్టిఫికెట్ల ద్వారా ఉద్యోగాలు పొందిన వారిని గుర్తించి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

డివిజన్‌లో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి



రాంనగర్‌ డివిజన్‌ సమస్యలపై వాటర్‌ వర్క్స్‌ జీఎంకు వినతి పత్రం సమర్పిస్తున్న భరత్‌గౌడ్‌ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్‌ డివిజన్‌లో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు బీజేపీ సికింద్రాబాద్‌ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్‌ ఆధ్వర్యంలో సోమవారం వాటర్‌ వర్క్స్‌ జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేసి సమస్యల పరిష్కారానికి కావాలసిన నిధులను అంచనా వేయాలని సూచించారు. వెస్లీ చర్చ్‌, పాలమూరి బస్తీలలో సీవరేజీ సమస్య, నెహ్రూనగర్‌–ఏ, సర్వోదయ నగర్‌, ఈడబ్ల్యూఎస్‌ క్వార్టర్స్‌, పాలమూరి బస్తీ తదితర ప్రాంతాలలో కొత్త పైప్‌ లైన్లు, శ్రీరాం నగర్‌ కమిటి హాల్‌, అరుంధతి స్కూల్‌, కరాచీ బేకరి వెనుక భాగం, చిక్కడపల్లి కమ్యూనిటీ హాల్‌లో హ్యాండ్‌ బోర్లు వేయాలని ప్రతిపాదించారు. దీనికి స్పందించిన జీఎం శ్రీధర్‌రెడ్డి అభివృద్ధి పనులకు సంబంధించిన ఖర్చులను అంచనావేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్‌ డీజీఎం మోహన్‌ రాజు, మేనేజర్‌ జీవన్‌ జ్యోతి, బీజేపీ సీనియర్‌ నాయకులు సి.పార్థశారథి, పి. జయపాల్‌రెడ్డి, జి.కిరణ్‌ కుమార్‌, నితిన్‌ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై ఆకతాయిల దాడి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

అంబర్‌పేట: అర్ధరాత్రి ఆకతాయిలు ఓ యువకుడిపై విచక్షణ రహితంగా దాడి చేశారు. దాడిలో ఆ యువకుడు తీవ్రంగ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన సోమవారం అంబర్‌పేట పోలీసుస్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాగ్‌అంబర్‌పేట అయ్యప్ప ఆలయం ఎదురు లేన్‌లో ఉండే నరేష్‌ కుమారుడు అభినవ్‌ సమీపంలోని వారి బంధువుల ఇంట్లో అమ్మవారి పూజ ఉండడంతో అక్కడ బయట రోడ్డుపై నిలబడి ఉన్నాడు. ఇంతలో కొద్దిపాటి పరిచయం ఉన్న స్నేహితుడు గౌతం అక్కడి వచ్చి చిన్న మాటమాట అనుకున్నారు. ఇంతలో గౌతం తన స్నేహితులను పిలిచి అభినవ్‌పై దాడి చేయించాడు. సుమారు 20 మంది యువకులు అభినవ్‌పై విచక్షణ రహితంగా దాడి చేశారు. బీర్‌ సీసాలతో సైతం కొట్టారు. ఈ దాడిలో అతడు తీవ్రంగా గాయపడ్డారు. ఇరుగుపొరుగు వారు విచ్చేసి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. తండ్రి నరేష్‌ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.